

నేటి నుంచి 19 వరకు బడిబాట


నిర్మల్‌కల్చరల్, జూన్5: జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి ఈనెల 19 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిఈడు పిల్లలను నమోదు చేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఆవాసప్రాంతాల్లో బడిఈడు గల పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని, నమోదు పెంచి నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. బడిబాటను జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చేపట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





ఆత్మ పరిశీలనలో హస్తం!

- పోలింగ్ సరళిపై సమీక్షలు
- బీజేపీ ఓటు బ్యాంకు పెరుగుదలపై లెక్కలు
- అంచనాలు తలకిందులు కావడంపై విశ్లేషణలు
- స్థానిక సంస్థల్లో పట్టు నిలుపుకునే దిశగా ముందస్తు వ్యూహాలు



నిర్మల్, జూన్5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపు సాధించడాన్ని ఇక్కడి కాంగ్రెస్ పార్టీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ భారీగా ఓట్లు సాధించడాన్ని ఆ పార్టీ నేతలు ఊహించలేకపోతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో భారీగా మెజార్టీ సాధించిన బీజేపీ ఖానాపూర్‌లో మాత్రం ఓటమిపాలైంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఖానాపూర్‌లో సైతం బీజేపీ కాంగ్రెస్ పార్టీ కన్నా 15వేల ఓట్లు అధికంగా సాధించడాన్ని ఆ పార్టీ నేతలు సహించలేకపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలంతా లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై విశ్వాసం పెంచుకున్నారు. అలాగే ఈ ఐదేళ్ల పాటు వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం అలాగే బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా చతికిలపడడంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో వరుస కట్టి చేరారు. ఈ చేరికల కారణంగా కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మరింతగా బలపడిందని అంచనా వేశారు. నిర్మల్‌తో పాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నేతలు అలాగే కొన్ని చోట్ల బీజేపీ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో ఇక్కడి రాజకీయ సమీకరణలు మారిపోయాయి. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అలాగే ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో పాటు కీలక నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై ధీమా పెట్టుకుంది. అయితే అంచనాలన్నీ తలకిందులై బీజేపీ నిర్మల్‌లో అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే మెజార్టీ సాధించింది. దాదాపు 43వేల ఓట్లను బీజేపీ కాంగ్రెస్ పార్టీ కన్నా ఎక్కువగా చేజిక్కించుకుంది. అలాగే ముథోల్‌లో కూడా దాదాపు 30వేలకు పైగా ఓట్లు మెజార్టీని బీజేపీ సాధించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఆధీనంలో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా బీజేపీ దాదాపు 15వేలకు పైగా మెజార్టీ ఓట్లను కూడగట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మంగళవారం సాయంత్రం వరకు ఫలితాలన్నీ తేలిపోవడంతో కాంగ్రెస్ పార్టీ నేతలు పోలింగ్ సరళిపై విశ్లేషణలు జరపడంలో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను కూడా టార్గెట్ చేసే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ భావిస్తోంది. దీనికి అనుగుణంగానే ఆత్మ పరిశీలన చేసుకొని దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ పార్టీ తలపెడుతోంది. ఇందులో భాగంగానే బుధవారం ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి ఆత్రం సుగుణతోపాటు డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ఆధిపత్యం నిలబెట్టుకొని అధికార పార్టీ పట్టును నిరూపించుకునేందుకు నిర్ణయించారు. దీని కోసం గానూ ముందస్తు ప్రణాళికలు నియోజకవర్గ, మండలాల వారిగా రూపొందించాన్న నిర్ణయానికి వచ్చారు. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఓటమితో కాంగ్రెస్ పార్టీ అంతర్మథనంలో పడడమే కాకుండా ఆత్మరక్షణకు సైతం సిద్ధమవుతోందంటున్నారు.

పోలింగ్ సరళిపై సమీక్షలు..

నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎక్కడెక్కడ ఓట్లు తగ్గాయనే అంశంపైనే కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీ ఇమేజ్ ఎక్కువగా ప్రభావం చూపడం, అలాగే సోషల్ మీడియా ద్వారా ఓ వైపు ప్రచారంతో పాటు మరోవైపు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం ఉధృతంగా కొనసాగించడం లాంటి అంశాలు సైతం ఓటమిలో కీలక పాత్ర పోషించాయని కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా హిందు సెంటిమెంట్‌ను బీజేపీ ప్రజల్లోకి బలంగా తీసుకుపోయి సానుభూతిని సంపాదించినట్లు చెబుతున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ రద్దు లాంటి అంశాలపై కూడా విస్తృతంగా ప్రచారం చేసి ఓటర్లను ఆకట్టుకుందని భావిస్తున్నారు. ఇలాంటి అన్ని అంశాలపై బీజేపీ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లి మెజార్టీ ఓట్లను సాధించగలిగిందని దీనికి అనుగుణంగా రాబోయే రోజుల్లో ఆ పార్టీని లక్ష్యంగా చేసుకొని వ్యూహరచనలు తలపెట్టాలని కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.

సోషల్ మీడియా బలోపేతంపై దృష్టి

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ సోషల్ మీడియా పైనే ఎక్కువగా ఆధారపడి ప్రధాని నరేంద్రమోడీని హైలేట్ చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీపై ఎదురు దాడిని కొనసాగించిన విషయాన్ని ఆ పార్టీ నేతలు పరిగణలోకి తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఎలాగైనా బీజేపీని వెనక్కి నెట్టేసి గెలుపు కోసం ముందస్తు వ్యూహ ప్రతి వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా గ్రామ, మండల, నియోజకవర్గాల స్థాయిల్లో సోషల్ మీడియా వ్యవస్థను విస్తృత పర్చాలని , దీని కోసం గానూ గ్రామాల వారిగా ఇన్‌చార్జీలను నియమించడం, వారికి నిరంతర శిక్షణలు కొనసాగించడం లాంటి చర్యలు చేపట్టబోతున్నారు. ప్రతీ రోజూ సమకాలీన రాజకీయ అంశాలతో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల వైఫల్యాలు ఆ పార్టీ విధానాల లోపాలు అలాగే కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో విధానాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ఇక దాటిగా ఎదురుదాడి కొనసాగించేందుకు నిర్ణయించారు. సోషల్ మీడియాను ఇక ప్రధాన ప్రచార వేదికగా మలుచుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై ముందస్తు నజర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటుకొని బీజేపీకి గట్టిగా చెక్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఇప్పటి నుంచే గ్రామాల వారిగా పార్టీని పటిష్ఠం చేస్తూ బీజేపీ సెంటిమెంట్‌ను తగ్గించేందు కోసం చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడి పరిస్థితులు, నాయకుల బల బలాలు గెలుపులో కీలకమవుతాయి గనుక ఆ దిశగానే కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేయబోతోందని అంటున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ పదవిని చేజిక్కించుకునేందుకు అత్యధిక జడ్పీటీసీ స్థానాలు అలాగే ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఎంపీటీసీ పదవులను పెద్ద సంఖ్యలో సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. దీంతో పాటు నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో కూడా ఈ సారి కాంగ్రెస్ పార్టీ పాగా వేయాలని భావిస్తోంది. అయితే చైర్మన్ పదవులు దక్కాలంటే ఈ మూడు మున్సిపాలిటీల్లో అత్యధిక కౌన్సిలర్ పదవులు దక్కించుకోవడం ముఖ్యమంటున్నారు. దీనికి అనుగుణంగా వార్డుల వారీగా కాంగ్రెస్ పార్టీ ఇక పకడ్బందీ ప్రణాళికతో పార్టీ కార్యక్రమాలే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టేందుకు సిద్ధమవుతోందంటున్నారు. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఓటమితో ఇక కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయాల కోసం ముందస్తుగానే సిద్ధమవుతోందని అంటున్నారు.



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హాజరైన అధికారులు

గ్రూప్-1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- నిమిషం ఆలస్యమైనా అనుమతించం: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, జూన్ 5 : ఈ నెల 9న జరిగే టీజీపీఎస్సీ గ్రూప్- 1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కమిషన్ నిబంధనలు అభ్యర్థులు, అధికారులు విధిగా పాటించాలన్నారు. పలు సూచనలు చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లపై తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో అతికించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒక గుర్తింపు కార్డు వెంట ఉండాలన్నారు. మొబైల్, ఎలక్ట్రానిక్, బూట్లతో కేంద్రంలోకి అనుమతించమన్నారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని, పరీక్ష పూర్తయ్యే వరకు బయటికి వెళ్లనివ్వమన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహిస్తారని, కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సామగ్రి తరలింపు సమయంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, సూపరిండెంట్లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీ మరింత బాధ్యత పెంచింది

- ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, జూన్5: పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో బీజేపీ అభ్యర్థి గొడం నగేష్‌కు భారీ మెజార్టీ లభించడం తనపై మరింత బాధ్యత పెంచిందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం భైంసాలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల మెజార్టీ కంటే పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీ దక్కడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. గత 5నెలల కాల వ్యవధిలో తానుచేపట్టిన అభివృద్ధి పనులు, పార్టీ కార్యకర్తల కఠోర శ్రమ, ముచ్చటగా మూడో పర్యాయం మోదీని ప్రధానిగా చేయాలనే సంకల్పం మూలంగా బీజేపీ అభ్యర్థి గెడం నగేష్ విజయానికి, అఖండ మెజార్టీకి సోపానాలుగా మారాయన్నారు. నగేష్ గెలుపునకు సహకరించిన ప్రతీఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల మంజూరు, నిధుల కేటాయింపు విషయంలో మాజీ ఎమ్మెల్యేలు గొప్పలు చెప్పుకోవడం, తప్పుడు మాటలు మాట్లాడటం మానుకోవాలని ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ హితవు పలికారు.

- కొనసాగుతున్న విజయోత్సవ సంబరాలు

ఆదిలాబాద్ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు కొనసాగుతున్నాయి. బుధవారం భైంసా మండల పరిధిలోని బీజేపీ శ్రేణులు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్ని తాకేలా నిర్వహించుకున్నారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌ను కలిసి సన్మానించారు.



ఎమ్మెల్యేకు మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ ప్రతినిధులు

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు

- నిందితులకు శిక్షపడేలా విచారణ జరపాలి
- జిల్లాలో నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపండి: సమీక్షా సమావేశంలో ఎస్పీ ఆదేశం



అంతర్జాల సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూన్ 5 : పోలీస్ స్టేషన్‌లలో నమోదయ్యే ప్రతీ కేసు పారదర్శకంగా విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా రిపోర్టులు తయారు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆమె ఆన్‌లైన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలిచ్చారు. పెండింగ్ ఉన్న కేసులపై సమగ్ర విచారణ జరుపాలని సూచించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేసేలా అధికారులు కృషి చేసి పోలీసు శాఖ ప్రతిష్ఠపెంచాలన్నారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసులలో విచారణ త్వరితగతిన పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణకు ఉక్కుపాదం మోపాలన్నారు. రైతులకు నష్టం కలుగకుండా చూడాలని ఆదేశించారు. నకిలీ అరికట్టేందుకు మరింత శ్రమించాలన్నారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. గోవుల అక్రమ రవాణా అడ్డుకోవాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు సమాచారం సేకరించాలన్నారు. నిర్మల్, భైంసా పరిధిలో 10 తనిఖీ కేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు. 24 గంటలు కేంద్రాల్లో ఉండి నిఘా పెట్టాలన్నారు. గోవుల అక్రమ రవాణా చేసే వారిపై కేసులు పెట్టాలని, రవాణాను అడ్డుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్

నిర్మల్ కల్చరల్, జూన్ 5 : ప్రకృతిని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలను పెద్దఎత్తున నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకం నియంత్రించాలని, వాతావరణ కలుషితానికి కారణమవుతుందన్నారు. సహజ వనరులు పొదుపుగా సద్వినియోగించుకోవాలని కోరారు. ఉపవైద్యాధికారి రాజేందర్, డాక్టర్ నయనారెడ్డి, శ్రీనివాస్, సౌమ్య, విస్తరణ అధికారి రవీందర్, సాయమ్మ, లక్ష్మీ, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు

కుంటాల. జూన్5: మండల కేంద్రం కుంటాలలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయిన అనూష, అనుప్రియల రక్షణకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద అన్నారు. వీరి తండ్రి శ్రీనివాస్ మంగళవారం మృతిచెందడంతో అనాథలైన పిల్లలను బుధవారం అంగన్‌వాడీ కార్యకర్త, బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, సామాజిక కార్యకర్త మమత తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు అందజేశారు. వీరిద్దరూ ఆదర్శ పాఠశాలలో 7, 9తరగతి చదివే మూగ, చెవిటి దివ్యాంగ పిల్లలని, గత ఐదు సంవత్సరాల క్రితం వీరి తల్లి మృతిచెందిందని ఐసీడీఎస్ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

కుంటాల, జూన్5: మండల కేంద్రం కుంటాల ఆదర్శ, మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 10నుంచి 15లోగా కళాశాల కార్యాలయాన్ని సంప్రదించి అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, జూన్5: మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నాలం శ్రీనివాస్ తల్లి నాలం భోజవ్వ మృతి చెందగా బుధవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీపీ అప్క, గజ్జారాం యాదవ్, వెంగల్ రావు, సిర్యార్ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

మొక్కలను పెంచుదాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో నాయకులు, అధికారులు



నర్సాపూర్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం



ముథోల్‌లో..

నర్సాపూర్(జి), జూన్5: మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షిద్దామనే నినాదంతో డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అంజనీ గ్రామంలో బుధవారం గ్రామస్థులు మొక్కలకు నీళ్లుపోసి రాబోయే వర్షాకాలంలో మొక్కలు పెంచాలని గుర్తుచేశారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాబోయే వర్షాకాలంలో ప్రతీఒక్కరు మొక్కలు నాటే విధంగా తమవంతు కృషి చేద్దామని తాజా మాజీ సర్పంచ్ అంజనాబాయి, గ్రామస్థులు, డ్రీమ్ సంస్థ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డ్రీమ్ సంస్థ కోఆర్డినేటర్ మురళి, అంబర్‌సింగ్, అంబాదాస్, సుదన్, జాదవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్ గ్రామపంచాయతీ పరిధిలోని కుంట చెరువు వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి చెరువు గట్టుపై ఉన్న చెత్తను క్లీన్ చేశారు. అలాగే గుంతలు తవ్వి మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ కింద కుంట చెరువు ఎంపిక కావడంతో చెరువులోని మట్టిని రైతులు తమ పంట పొలాలకు తీసుకెళ్లడంతో చెరువులో నీటి మట్టం పెరగడం జరిగిందని ఏపీవో శిరీష రెడ్డి పేర్కొన్నారు. దీంతో ఆయకట్టు కింద సాగు విస్తీర్ణం పెరగడం జరుగుతుందన్నారు. ప్రకృతితో మానవ మనుగడ ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో అమీర్ ఖాన్, ఏపీవో శిరీష రెడ్డి, టీఏ, పంచాయతీ కార్యదర్శి, రైతులు, తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న న్యాయాధికారి

నిర్మల్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని న్యాయాధికారి ఆర్.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్మల్ మండలం కొండాపూర్‌లోని బాలసదనం, అంగన్‌వాడీ కేంద్రాలలో మొక్కలు నాటి పర్యావరణ యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ చెట్లు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఏ. నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మీ, సూపర్‌వైజర్ మంగళ, బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కవిత, సుమలత మధుసూదన్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

టీడీపీ కూటమి గెలుపుతో సంబరాలు

తలమడుగు,జూన్5:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, మహా కూటమి భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ రాష్ట్ర ప్రజలు తెలివైన నిర్ణయం తీసుకున్నారని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాడేరాములు అన్నారు. ఈ సందర్భంగా తలమడుగు మండల కేంద్రంలో కాడే రాములు ఆధ్వర్యంలో కూటమి భారీ గెలుపుతో తెలుగుదేశం పార్టీ నాయకులు, భాజాపా మండల నాయకులతో సంబరాలు జరుపుకుని మిఠాయిలు తినిపించుకుని బాణసంచా పేల్చారు. ఈ సందర్భంగా కాడె రాములు మాట్లాడుతూ.. నియంత పాలన సాగించిన జగన్‌సర్కార్‌ను ఆ రాష్ట్ర ప్రజలు ఓడించారని అన్నారు. నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని విలువలతో కూడిన రాజకీయాలను ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తారకరామారావు నాయకులకు నేర్పించారని,చంద్రబాబు నాయుడు నాయ కత్వంలో ఆంధ్రరాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆంధ్రాలో సకో పాలన పోయి మంచి రోజులు వచ్చాయన్నారు. చంద్రబాబు నాయుడు పాలన దేశానికి ఆదర్శమని అన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్, చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు పక్కగృహాలు ఇప్పటికిచ్చిన స్థాయిగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో పరిపాలించినప్పటికి గ్రామాల్లో ఒక్క ఇంటిని ఇప్పటి వరకు నిర్మించ లేదన్నారు. ఇందులో బాజాపా నాయకులు రామ్‌రెడ్డి,మేకల చిన్నలింగన్న, శేవ్వగంగారెడ్డి, లింగాలరాజన్న, స్వామి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తలమడుగులో బాణసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం : కాంబ్లే గోపీనాథ్



ర్యాలీలో బయో డైవర్సిటీ బోర్డు కోఆర్డినేటర్ సోన్ కాంబ్లే గోపినాథ్

ఇంద్రవెల్లి,జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బయోడైవర్సిటీ బోర్డు కో ఆర్డినేటర్ సోన్ కాంబ్లే గోపినాథ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అటవీశాఖ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని సూచించారు. మొక్కలను నాటడం ద్వారా మనిషి స్వచ్ఛమైన గాలిని పీల్చుకుని ఆరో గ్యంగా ఉంటాడని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. భావితరాలు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే ప్రతీఒక్కరు ప్రకృతిని కాపాడుకుందామని తెలిపారు.ఈకార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు:మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ పురస్కరించుకొని హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసంద ర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు

సారంగాపూర్: మానవ మనుగడకు చెట్లు కీలకమైనవని బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానన్ అన్నారు. బుధవారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండి రామన్న హరిత వనంలో ప్రపంచ పర్యా వరణ దినోత్సవాన్ని నిర్వహించి, హరిత వనంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ప్రసాద్‌రెడ్డి, సంతోష్, వేణుగోపాల్, ఉన్నారు.

దిలావర్‌పూర్: పర్యావరణ పరిరక్షణకు మనమందరం పాటుపడదామని ఎంపీడీవో అరుణరాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని బుధవారం మండలంలోని దిలావర్‌పూర్, కాల్వ, మాడేగాం గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీవో సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీవో దివ్యరెడ్డి, పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా: ఎంపీ గోడం నగేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడంనగేష్

ఆదిలాబాద్‌అర్బన్,జూన్‌5: తనపై నమ్మకం ఉంచి గెలిపించిన జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ గోడంనగేష్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు.పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అనేక రకా లుగా ఆరోపణలు,ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన ప్రజలు దాన్ని తిప్పికొట్టారని ఎంపీ అన్నారు. బీజేపీని, మోదీ నాయకత్వాన్ని బలపరి చేలా తీర్పు నిచ్చార న్నారు. తన గెలుపుకు కార్య కర్తలతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపు తున్నా రన్నారు.అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రికి ప్రజలు ఆదిలా బాద్ సీటు గెలిపించి బహుమతిగా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదిలాబాద్ సీటు బీజేపీ కైవసం అయ్యిందన్నారు. పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీతో కలిసి పంచపాండవ ుల్లాగా జిల్లా అభివృ ద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మా నందం, ఆధినాథ్, తాటిపెల్లి, అశోక్, రావులరాంనాథ్ తదితరులున్నారు.

ప్రశ్నించే గొంతుకగా ఉంటా

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క
- ఎన్నికల్లో గెలుపోటములు సహజమని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రంసుగుణ

ఆదిలాబాద్‌అర్బన్, జూన్‌5:ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తాను ఓడినా నిత్యం ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రజల మధ్యలోనే ఉంటానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాసరెడ్డి ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం తోనే ఒక గొప్ప ఆశయంతోనే తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గెలిస్తే పొంగిపోయేది లేదు, ఓడితే కుంగేది లేదని నిత్యం నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రశ్నించే గొంతుకగా ఉంటానన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎంపీగా విజయం సాధించి ప్రజాసేవే లక్ష్యంగా, నియోజక వర్గంలో అభివృద్ధి చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. ఇప్పుడు ఓటమి చెందిన కుంగిపోకుండా ప్రజల్లో ఉంటూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తాన్నారు. ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చామని, ప్రజల తీర్పును తప్పకుండా గౌరవిస్తామని తెలిపారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికి నైతిక విజయం కాంగ్రెస్‌దేనని అన్నారు. ప్రజల తీర్పును గౌర వించి స్వాగతిస్తామని తెలిపారు. పురుషులతో సమా నంగా మహిళలు కూడా రాజకీయాల్లో రాణించాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదివాసీ మహిళ ఆత్రంసుగుణక్కకు టికెట్ కేటాయించింద న్నా రు. అందరి సమిష్టి కృషి వల్లే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా కాంగ్రెస్ ఓట్లు సాధించిందన్నారు. ఇదే తమ గొప్ప విజయంగా భావిస్తు న్నామని తెలిపారు. పార్లమెంట్‌లో ఓట మి చెందడానికి కొందరు కాంగ్రెస్ నేతలే కారణమని కొన్ని మీడియా సం స్థలు అసత్య ప్రచారం చేశాయని, అందులో వాస్తవం లేదన్నారు. అం దరు కష్టపడి పని చేశారని, గెలుపు బాధ్యతలను తమ భుజాలకెత్తుకున్నా రని తెలిపారు. వాస్తవాలను ప్రతిబిం చేలా ప్రసారాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

● బీఆర్ఎస్, బీజేపీ కుమ్మకు వల్లే

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు కావడం వల్లే పార్లమెం ట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించలేక పోయిందని, బీఆర్ఎస్ దగ్గరుండి బీజేపీకి ఓట్లు వేయించిందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతం కంటే ఎక్కువగానే ఓట్లు సాధించామని, కాంగ్రెస్‌ను ఓడించడమే లక్ష్యంగా వారు కలిసి పని చేశారని ఆరోపించారు. డీసీసీబీడైరెక్టర్ బాలూరిగోవర్ధన్‌రెడ్డి,ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్‌రావ్, ఆదివాసీ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,దర్శనాల లక్ష్మణ్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్, జాఫర్ అహ్మద్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు



అతిగా మద్యం తాగి యువకుడి మృతి

తాంసి, మే 5: అతిగా మద్యం తాగి ఆసుపత్రి పాలైన ఆయువకుడు మృతి చెం దాడు. వివరాల్లోకి వెళితే తాంసి మండలం జామిడి గ్రామానికి చెందిన ప్రవీణ్ యాదవ్ (28) అనే యువకుడు శనివారం ఇం టి వద్ద అతిగా మద్యం సేవించారు. స్పృహ కోల్పోయిన ఆ యువకుడిని స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గత 40 రోజుల పాటు హనుమాన్ దీక్ష తీసుకున్న అయన దీక్ష విరమణ వెంటనే మద్యం సేవించడంతో ఆ సంఘటన జరిగినట్లు పలువురు భావిస్తున్నారు. మొత్తం మీద అధి క మద్యం ఆ యువకుడి ప్రాణాల మీదకి తెచ్చింది.

ఉట్నూర్‌లో బీజేపీ సంబురాలు



ఉట్నూర్‌లో టపాసులు పేలుస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్,జూన్‌5:ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యునిగా గోడంనగేష్ విజయంసాధించడంతో ఉట్నూర్‌లో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించుకున్నారు.ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌర స్తాలో టపాసులు పేలుస్తూ సంబరాలు నిర్వహించుకున్నారు.ఈ సంద ర్భంగా బీజేపీరాష్ట్రనాయకులు రాథోడ్‌రితేష్ మాట్లాడుతూ మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చూడాలని భావించిన ప్రజలందరు బీజేపీ అభ్యర్థిని గెలిపించారన్నారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలో ప్రజలందరికి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి వస్తా యన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్,మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్, చింతల రమణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాంసి: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ కైవసం చే సుకోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మండల కేంద్రానికి ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ముందుగా గ్రామంలో జై మోదీ జైజై మోదీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. టపాసులు కాల్చారు. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. బోథ్ నియోజకవర్గంలోనే మండల కేంద్రమైన తాంసిలో బీజేపీ పార్టీ అభ్యర్థికి 1050 ఓట్లు పాడటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఓటు వేసిన ప్రతి ఒక్కరికి వాళ్ళ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సామ సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ్‌కుమార్, పరమేశ్వర్, ప్రవీన్, అరుగుల రాములు, నాగన్న, పెంటపర్తి స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

బోథ్:నూతనంగా గెలుపొందిన ఆదిలాబాద్ జిల్లా ఎంపీ జి.నగేష్ ను బుధవారం బీజేపీ నాయకులు కలిశారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చాకటి దశరథ్‌తో పాటు మండలానికి చెందిన పలువురు నాయకులు నూతనంగా గెలుపొందిన ఎంపిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను సైతం సన్మానించారు.

నేరడిగొండలో ఘోర ప్రమాదం .. ఒకరి మృతి

నేరడిగొండ,జూన్‌5: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో బుధవారం ఉదయం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సందర్భం గా దూడగండి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పై గుర్తు తెలి యని వ్యక్తిని ఓ వాహనం ఢీకొంది.దీంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెం దాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సంప్రదించగా వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఘటనకు సంబంధిత పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.













ఎంపీ గోడం నగేష్‌కి అభినందన



ఎంపీని అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఆదిలాబాద్‌అర్బన్,జూన్‌5:పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడంనగేష్‌కు అభినం దనలు వెలువెత్తాయి.బుధవారం ఆయన నివాసంలో పట్టణ ప్రముఖులు, ఆయా సంఘాలు, బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలు వతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. అదే విధంగా ఆయా మండలాల పార్టీ నాయకులు, మహిళ విభాగం నాయకురాళ్లు ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ గోడంనగేష్‌కు పలువురు బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి రాష్ట్రనాయకులు ఎంపీకి పుష్పగుచ్చాన్ని అందించి అభినందించారు. ఆయన వెంట గణేష్, కౌన్సిలర్ రఘుపతి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

ఇంద్రవెల్లి, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బయోడైవర్సిటీ బోర్డు కో ఆర్డినేటర్ సోన్ కాంబ్లే గోపినాథ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీఒక్కరు మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

- ఎంపీ ఎన్నికల్లో జిల్లా ఎమ్మెల్యేల పనితీరుపై భిన్నాభిప్రాయాలు
- సొంత నియోజకవర్గాల్లోనే కనిపించని మెజార్టీ
- పార్టీ అభ్యర్థికి మద్దతుపై ఎన్నో అనుమానాలు
- అధిష్ఠానం పెద్దలకు మొదలైన ఫిర్యాదులు

ఎమ్మెల్యేలు ఫెయిల్!





ఆదిలాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా ఎమ్మెల్యేల పనితీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేలే గెలిపిస్తారని ఎన్నో ఆశలుపెట్టుకున్న అభ్యర్థులకు చివరకు నిరాశే మిగిలింది. గెలిచినా ఆశించినస్థాయిలో మెజార్టీ రాలేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ నాయకత్వ బలాన్నే నమ్ముకుని ఎన్నికల బరిలో నిలిచిన ఫలితాలు తారుమారు కావడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న నియోజకవర్గాల్లోనూ రెండు, మూడుస్థానాలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. సొంత నియోజకవర్గాల్లోనే పార్టీ అభ్యర్థికి మెజార్టీ రాక వెనుకబడి పోవడం పలు సందేహాలకు దారి తీస్తోంది. అసలు ఎమ్మెల్యేల మద్ధతుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైపైకి భాగానే కనిపిస్తున్న లోలోన మాత్రం కుట్రలు చేశారన్న విమర్శలు లేకపోలేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ, రెండు నియోజక వర్గాల్లో బీఆర్ఎస్, ఒకే ఒక నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లతో పోల్చుకుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు సాధించిన ఓట్లు పూర్తిగా తలకిందులయ్యాయి. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీజేపీ ముమ్మర ప్రయత్నాలు చేసి విజయం సాధించగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పట్టునిలుపుకో లేకపోయింది. అసలే అధికారానికి దూరమైన బీఆర్ఎస్ పూర్తిగా డీలాపడిపోయింది. మొదటి నుంచి మూడు ప్రధానపార్టీల మధ్య నువ్వానేనా అన్నట్లుగా ఉన్న ఎన్నికల సమయానికి కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ కనిపించింది. అనుకున్న మాదిరిగానే ఫలితాలు కూడా వచ్చాయి. దీంతో నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నేతలు సరిగా పనిచేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆశించిన మెజార్టీ రాలేకపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గెలిచిన ఆరు మాసాలలోనే కొంత మంది ఎమ్మెల్యేల గ్రాఫ్ పడిపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓటమికి అసలు కారణం ఎమ్మెల్యేలా నిర్లక్ష్యమేనంటూ కొందరు సీనియర్ నేతలు అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

తగ్గిన మెజార్టీ

పార్టీ అభ్యర్థి గెలిచిన ఆదిలాబాద్ నియోజకవర్గంలో మాత్రం మెజార్టీ తగ్గిందన్న చర్చ సాగుతోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పాయల శంకర్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగురామన్నపై 6వేలపై చిలుకు ఓట్లతో గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 67,608 ఓట్లు రాగా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 82,394 ఓట్లు వచ్చిన వెయ్యికి పైగా మెజార్టీ తగ్గింది. ఇక్కడ కేవలం 5338 ఓట్ల మెజార్టీని బీజేపీ సాధించింది. పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న ఇతర నియోజకవర్గాల్లో బీజేపీ భారీగా మెజార్టీ సాధించింది. ఆ నియోజకవర్గాలతో పోల్చుకుంటే ఆదిలాబాద్‌లో వచ్చిన మెజార్టీ స్వల్పంగా ఉందన్న అభిప్రాయాలు సొంత పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి. మెజార్టీని బట్టే ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందో అంచనా వేయవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ భారీగా పుంజుకోవడంతో బీజేపీకి ఆశించినస్థాయిలో మెజార్టీ రాలేదన్న టాక్ విన్పిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 47వేల ఓట్లు సాధించిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 77వేల 056 ఓట్లను సాధించింది. అయితే బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీ వైపు మళ్లిన పెద్దగా మెజార్టీ రాలేక పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ కేవలం 16265 ఓట్లను సాధించి మూడో స్థానంలో నిలిచింది. కేవలం మోదీ ఈమేజ్‌తోనే బీజేపీ గట్టెక్కిందన్న అభిప్రాయాలు లేకపోలేదు.





నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
ఆదిలాబాద్	16265	77056	82394
బోథ్	22472	65204	70118
ఖానాపూర్	18520	61587	75106
ఆసిఫాబాద్	38597	73996	47056

పల్టీ కొట్టిన కారు

లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానంతోనే సరిపెట్టుకున్న బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గంలో పల్టీ కొట్టిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్న ఆశించినస్థాయిలో ఓట్లు రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కుకు బోథ్ నియోజకవర్గంలో 22472 ఓట్లు మాత్రమే దక్కాయి. అదే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మెజార్టీ ఓట్లను దక్కించుకున్నారు. కాంగ్రెస్‌కు 65,204 ఓట్లు రాగా బీజేపీ 70,118 ఓట్లను సాధించింది. గడిచిన అసెంబ్లి ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ 76,792 ఓట్లను సాధించి విజయం దక్కించుకుంది. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి 54,320 ఓట్లు బీఆర్ఎస్‌కు దూరమయ్యాయి. పార్లమెంట్ పరిధిలోనే భారీ ఆశలు పెట్టుకున్న బోథ్ నియోజక వర్గంలో ఆశించిన మెజార్టీ దక్కక పోవడంతో అభ్యర్థికి ఓటమి తప్పలేదు. అంచనాలు తలకిందులు కావడంపై అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ భారీగా పుంజుకోవడం కారు పార్టీకి కొంత ఇబ్బందికరంగానే మారింది. అలాగే బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ సొంత నియోజకవర్గం కావడంతో ఆయనకు అనుకూలంగా మారిందంటున్నారు.

గెలిచినా.. కనిపించని హవా

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం హవా కనిపించలేదు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ వెనుకబడింది. సొంత పార్టీ ఎమ్మెల్యే ఉన్న పార్టీ అభ్యర్థికి ఆశించినస్థాయిలో మద్దతు దక్కలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 58వేల 870 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 54వేల 168 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మబొజ్జు 4702 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అదే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌కు 61వేల 587 ఓట్లు రాగా బీజేపీ మాత్రం 75106 ఓట్లను దక్కించుకుంది. అసెంబ్లి ఎన్నికల్లో 4702 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 13519 ఓట్లను కాంగ్రెస్ కోల్పోయింది.

అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంతో సరిపెట్టుకున్న బీజేపీ గడిచిన ఆరు మాసాల్లోనే మొదటి స్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ మాత్రం రెండవ స్థానం నుంచి మూడవ స్థానంకు పడిపోయింది. బీజేపీ, బీఆర్ఎస్‌ల మాట ఎలాఉన్నా అధికార పార్టీ కాంగ్రెస్‌కు ఖానాపూర్‌లో భారీగా మెజార్టీ తగ్గడం పై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ ఆధిక్యం

ఆసిఫాబాద్‌లో గెలిచిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మూడవ స్థానంతోనే సరిపెట్టుకుంది. అసెంబ్లి ఎన్నికల్లో బీఆర్ఎస్ 83,036 ఓట్లను సాధించి మొదటిస్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అభ్యర్థిపై 22వేల798 ఓట్లతో కోవలక్ష్మి ఎమ్మెల్యేగా గెలిచింది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కేవలం 38,597 ఓట్లను దక్కించుకుని పూర్తిగా వెనుకబడి పోయింది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే లోక్‌సభ ఎన్నికల్లో 44,439 ఓట్లను కోల్పోయింది. దీంతో పార్టీ అభ్యర్థికి ఓటమి తప్పలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో 60238 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో మరింత బలపడి 73,996 ఓట్లతో మొదటి స్థానం దక్కించుకుంది. పార్లమెంట్ పరిధిలోనే ఆసిఫాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ ఆధిక్యతను సాధించి పార్టీ అభ్యర్థికి అండగా నిలిచింది. బీజేపీ పై 26940 ఓట్ల మెజార్టీతో పై చేయి సాధించింది. అయిన పార్టీ అభ్యర్థి గెలువక పోవడంతో ఈ నియోజక వర్గ ఓటర్లను తీవ్ర నిరాశపరిచింది. బీజేపీ 47వేల 56 ఓట్లను దక్కించుకొని రెండవ స్థానంలో నిలవగా 38వేల 597 ఓట్లను దక్కించుకుని బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైంది.

సంక్షిప్త సమాచారం



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఇంద్రవెల్లి, జూన్5: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి అరుణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేశారు. అనంతరం దుకాణాల్లో సీడ్‌స్టాక్, రిజిష్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్‌బుక్స్‌స్టాక్ బోర్డు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏ డీలరైనా విత్తనాలను ఎంఆర్‌పీ ధర కంటేఅధిక ధరలకు విక్రయిస్తే కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు ముప్పే

బోథ్, జూన్5: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు ముప్పు ఉంటుందని బోథ్ మున్సిపల్ మెజిస్ట్రేట్ బి.హస్సేన్ పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్ల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ప్రతి వ్యక్తి తనవంతుగా రెండు మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంలో చెట్లు ప్రముఖ పాత్రని పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే, ఉపాధ్యక్షులు మోహన్‌రావు, కార్యదర్శి, న్యాయవాదులు అడేపు హరీష్, కుమ్మరి విజయ్‌తో పాటు కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

బోథ్, జూన్5: ఉపాధిహామీ పథకం కింద చిన్న సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఉపాధిహామీ మండల అధికారి జగ్గిరావు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం కింద జామ, మామిడి, దానిమ్మ సంత్ర, సపోటా, మునగ మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. ఇక చేనుగట్ల పక్కన కొబ్బరి చెట్లను సరఫరా చేస్తామన్నారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే మొక్కలు మునగ మొక్కలకు ఏడాది, మామిడి మొక్కల పెంపకానికి మూడేళ్లు, బత్తాయి మొక్కల పెంపకానికి రెండు సంవత్సరాలు, మెయింటెనెన్స్ కింద డబ్బులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది రైతులు పండ్ల తోటలను పెంచి ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సిద్ధం





పాఠశాలల విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న పాఠ్యపుస్తకాలు



ఉట్నూర్‌కు లారీలో చేరుకున్న పాఠ్యపుస్తకాలు

ఉట్నూర్, జూన్ 5: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠ్య పుస్తకాలను సిద్ధం చేస్తున్నారు.ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు 4.20లక్షల పాఠ్య పుస్తకాలు, 3.28నోటు పుస్తకాలను పంపించాలని ప్రభుత్వానికి ఇండెంట్ పంపించగా సుమారు 50వేల పాఠ్య పుస్తకాలు తక్కువగా పంపించినప్పటికి 15 రోజుల్లో అవి కూడా వస్తాయని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని సైతం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నోటు పుస్తకాల పై ముద్రించారు. జిల్లాలోని ఉట్నూర్ ఇంద్రవెల్లి, నార్నూర్, జైనథ్, బేల, ఆదిలాబాద్, తలమడుగు,తాంసి,భీంపూర్, సిరికొండ, నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, గుడిహత్నూర్, మావల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను జిల్లా అధికారులు లారీల ద్వారా చేరవేస్తున్నారు. తెలుగు మీడియం పుస్తకాలతోపాటు ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు సైతం పంపిణీ చేయడం జరుగుతుందని, జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయా మండలాల విద్యాశాఖ అధికారుల నివేదికల ప్రకారం పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, ఇంకా ఎక్కడైనా తక్కువ పడితే మళ్లీ పంపిస్తామని వివరించారు. కావాల్సిన పుస్తకాలను అన్ని మండ లాలకు చేరవేస్తామని వెల్లడించారు.



వ్యవసాయ పనుల్లో రైతులు

ప్రారంభమైన ఖరీఫ్ పనులు

బజార్‌హత్నూర్, జూన్5: మండలవ్యాప్తంగా రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి రైతులు ఖరీఫ్ పనులను మండలంలో జోరుగ కొనసాగుతున్నాయి. సాగుకు సిద్ధంగా ఉంచిన పంటపొలాల్లో రైతులు పత్తి పంటలను విత్తుతున్నారు. జూన్ మొదటి మాసంలో పత్తి విత్తనాలు విత్తడంతో పంట అధిక మొత్తంలో దిగుబడితోపాటు చీడ,పీడల బెడద కూడా తక్కువగా ఉంటుందని, అందుకే విత్తనాలను విత్తుతున్నామని తెలిపారు. అంతేకాకుండా కూలీలు కూడా సకాలంలో అందుబాటులో ఉంటారని అందుకే ఈమాసంలో రైతులు ఎక్కువ మొత్తంలో విత్తనాలను విత్తుతున్నారని అన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా సైబర్ డీఎస్పీ హసిబుల్లా



సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జైనథ్, జూన్5: ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా గ్రామాల ప్రజలు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ హసిబుల్లా అన్నారు. బుదవారం మండల కేంద్రమైన జైనథ్‌లోని స్థానిక లక్ష్మినారాయణ స్వామి ఆలయప్రాంగణంలో గ్రామప్రజలకు మహిళలకు రైతులు యువతీ యువకులకు అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా డీఎస్పీ హసిబుల్లా మాట్లాడుతూ ఏటీఎంలు అసైన్డ్ భూముల రిజి స్ట్రేషన్, పట్టాపాస్‌బుక్ బ్యాంక్ అకౌంట్‌లకు సంబంధించిన ఫోన్ ద్వారా వచ్చి న యాప్‌లను క్లిక్ చేయవద్దన్నారు. ఎలాంటి విషయాలను దృష్టికి వస్తే ఎస్‌బీ అధికారులు తమ దృష్టికి తీసుకురావా లన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ రూరల్ పోలీసు స్టేషన్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై వి.పురుషక్షత్తంలతో పాటు జైనథ్ పోలీసు సైబర్ క్రైం ఆదిలాబాద్‌జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు కృషి చేయాలి: మాజీ మంత్రి

మొక్క నాటుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్ అర్బన్, జూన్5: మొక్కల సంరక్షణలో భాగస్వాములై ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటేందుకు కృషిచేయాలని మాజీ మంత్రి జోగురామన్న పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగురామన్న పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పార్టీలకు అతీతంగా కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణతోనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్నారు.హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి పల్లెప్రకృతి వనాలు ఏర్పాటుచేసి మొక్కల ఎదుగుదలకు విశేషంగా కృషి చేశారన్నారు. మానవుడి మనుగడ రైతు సంక్షేమం మొక్కలపై ఆధారపడి ఉంటుందని ప్రతీఒక్కరు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బిజ్జ గిరినారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ కొమ్రరాజు, సెవ్వాజగదీశ్, డైరెక్టర్ మేస్రం పరమేశ్వర్, అర్చనరామ్‌కుమార్, గడ్డంలక్ష్మణ్, నవాతేశ్రీనివాస్, మోరియాసురేందర్, గేడంరాజు, రాజేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుపుతున్న ఆర్మీ జవాన్లు

అశ్రునయనాల మధ్య ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

- పెద్ద ఎత్తున తరలొచ్చిన జనం



సూర్యవంశీ రాజేశ్వర్ ఫొటో (ఫైల్)

సిరికొండ, జూన్5: అశ్రునయనాల ఆర్మీజవాన్ సూర్యవంశీ రాజేశ్వర్ (35) అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో ముగిశాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సూర్యవంశీ రాజేశ్వర్ 14ఏళ్లుగా హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజేశ్వర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి తన భార్యని తన స్వగ్రామానికి పంపించడానికి బయలుదేరి, తిరిగి తన క్వార్టర్స్‌కి చేరుకు నేక్రమంలో ఆటోప్రమాదానికి గురై మృతిచెందాడు అని కుటుంబసభ్యు లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యు లు అక్కడకు చేరు కుని రాజేశ్వర్ భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో ఆర్మీజవాన్లు బుధవా రం ఉదయం ఆయన స్వగ్రామమైన ఆదిలాబాద్ జిల్లా సిరికొండకు తీసు కువచ్చారు. ముందుగా సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్‌రోడ్డు నుంచి అతని భౌతికకాయాన్ని భారీ బైక్‌ర్యాలీ మధ్య సిరికొండకు తీసుకువచ్చారు. అనంతరం ఆర్మీజవాన్లు, పోలీసులు సైనిక లాంచనాలతో అంత్యక్రియలు ముగించారు. అంత్యక్రియలకు పలువురు నాయకులు, పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు సీఆర్‌పీఎఫ్ బలగాలు : అదనపు ఎస్పీ

ఆదిలాబాద్: క్రమశిక్షణకు మారుపేరు సీఆర్‌పీఎఫ్ బలగాలని అదన పు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు వీడ్కోల కార్యక్రమాన్ని స్థానిక పైటీసీ కేంద్రంలో నిర్వహించగా ముఖ్యఅతి థిగా అదనపు ఎస్పీ హాజరయ్యారు. సీఆర్పీఎస్ సిబ్బందికి పూలమాల శాలువాలతో సత్కరించి సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేంద్రరావు మాట్లాడుతూ సీఆర్ పీఎఫ్ సిబ్బంది స్ట్రాంగ్ రూమ్ విధులను ఎండనక, వాననక నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించారన్నారు. అలాగే వీరుచేసిన సేవలను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ కొనియాడారు. ఇందులో సీఐలు కె.సత్యనారాయణ, ఎ. అశోక్, ఫణిధర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు